# కోరిక

డివి హయాత్

చాలా యేళ్ళనాటి మాట.

విశ్వానికప్పుడు పధ్నాలు గేళ్ళుంటాయేమో. వొకరోజు తెలుగు టెక్స్టు బుక్కులో ఏదో పాఠం చదువుతూ కూర్చున్నవాడల్లా గబుక్కున ఏదో సందేహం వచ్చినవాడిలా తలెత్తి, "నాన్నా! చచ్చిపోయింతర్వాత నిజంగా ఏం జరుగుతుంది?" అనడిగాడు.

ఏవో కాగితాలు చూసుకుంటున్నవాడల్లా వాళ్ళ నాన్న విశ్వానికేసి చూసి చాలా దయగా నవ్వాడు.



"యేమో!" అని మాత్రం అని ఆయన తిరిగి తన కాగితాల్లోకి తలదూర్చాడు.

విశ్వం అంతటితో వదిలిపెట్టలేదు.

"చచ్చిపోయిం తర్వాత నిజంగా స్వర్గం నరకం వుంటాయా నాన్నా?"

మరోసారి ఆయన కాగితాల్లోంచి తలెత్తి కళ్ళద్దాలు సవరించుకొని కొడుకు కళ్ళలోకి చూసి నిజాయితీగా అన్నాడు, "అదేమో నాకు తెలీదు. నిజంగా తెలీదు. అయినా, యిప్పుడీ వయస్సులోనే నీకిన్ని ఆలోచన లెందుకు నాన్నా?" అని కొడుకు కళ్ళల్లో రగులుతున్న వుత్సుకతను చూశాక ఆయన మళ్ళీ అన్నాడు. "అవన్నీ యిప్పుడు కాదు నాన్నా నువ్వాలోచించాల్సింది; దాని కింకా బోల్డు టైముంది. అయినా లోకంలోని తెలివి గలవాళ్ళంతా యీ విషయం గురించే ఆలోచించి యెందుకు టైం వేస్టు చేసుకుంటారో నాకు తోచదు. ప్రతివాడూ యెప్పుడో వొహప్పుడు ఆ రహస్యం తెలుసు

## రచయిత గురించి...


పుట్టింది యిరవై ఆరేళ్ళ క్రితం వెంకటగిరిలో.

స్వగ్రామం కడప జిల్లా ప్రొద్దుటూరు.

మూడేళ్ళ క్రితం రుధిరోద్గారిలో తొలి కథను 'ఆంధ్రజ్యోతి' వారే ప్రచురించారు. దాని పేరు 'అహింస'. అదే కథను భారతీయ జ్ఞానపీఠం వారు 1983 నాటి ఉత్తమ భారతీయ కథల్లో వొకటిగా యెంచుకొని శ్రీ ఎ.రాజారామమోహనరావుగారి మరో తెలుగు కథతో పాటు హిందీలోకి అనువదించి ప్రచురించారు.

ఆ తర్వాత మరో రెండు కథలు 'ఆంధ్రజ్యోతి' లోనే వచ్చాయి. వాటిలో 'ప్రదర్శన' అనే కథను అవనిగడ్డ గాంధీ కళాక్షేత్రం వారు 'తెలుగు కథల్లో గాంధీ దర్శనం' అనే శీర్షిక కింద వొక కథా సంకలనంలో పునః ప్రచురిస్తున్నారు.

'విపుల' మాసపత్రికలో మరో రెండు కథలు వచ్చాయి.



ప్రస్తుతం నెల్లూరులోని వెంకటగిరి రాజావారి 'లా' కాలేజీలో బి.ఎల్. ఫైనలియర్ పరీక్షలు రాయబోతున్నాను.

దాదా హయాత్

కుంటాడు గదా!''

విశ్వానికీ మాటల్లో అంతూ పొంతూ తోచక, ''యెప్పుడు?'' అనడిగాడు అమాయకంగా.

''చనిపోయినప్పుడు!'' చాలా సింపుల్‌గా అనేశాడు వాళ్ళ నాన్న. ''ప్రతి జీవి యెప్పుడో వొకప్పుడు చావ డానికే పుడతాడు.''

ఆ తర్వాత ఆ రోజే రాత్రి వొంటి గంటకు ఆయన చనిపోయాడు. హఠాత్తుగా చాలా తీవ్రమైన గుండె నొప్పి రూపంలో వచ్చింది చావు. నొప్పి వచ్చాక రెండు మూడు నిమిషాలకంటె యెక్కువ వుండలేదాయన.

ఆ రోజు యింట్లో మిగతావాళ్ళతో పాటే యేడ్చాడు విశ్వం. మనసులో మాత్రం, ''నాన్నకా రహస్యం యీ పాటికి తెలిసిపోయే వుంటుంది. మరి, నాకెప్పుడు తెలుస్తుంది?'' అనాలోచించాడు.

ఆలోచించడం అప్పుడప్పుడే కొత్తగా నేర్చుకుంటున్న ఆ వయస్సులో అప్పటికప్పుడే కొన్ని లెక్కలు కూడా తయారు చేసుకున్నాడు విశ్వం.

చనిపోయే నాటికి విశ్వం వాళ్ళ నాన్నకు నలభై అయిదేళ్ళు. విశ్వం తాతగారు యేభైయేళ్ళకు పోయాట్ట. మరి, ముత్తాత యెప్పుడు పోయాడో విశ్వానికి తెలీదు. కొద్ది రోజుల్లోనే ఆ విషయం కూడా కూపీ లాగాడు విశ్వం. ఆయన యేభై అయిదేళ్ళకు పోయాట్ట.

తన ముత్తాత కంటె తాత అయిదేళ్ళు తక్కువ బతికాడు. తాతకంటె తండ్రి మరిఅయిదేళ్ళు తక్కువ. యీ లెక్కన తనెప్పుడు పోతాడు? తండ్రి కంటె మరో అయిదేళ్ళు తక్కువగా నలభైయేళ్ళకన్నమాట! చావంటే విశ్వానికి భయం కలగలేదు. తండ్రి చావు చూశాక చావంటే భయంగా అనిపించలేదు.

మరో పాతికేళ్ళకు తనూ ఆ రహస్యం తెలుసుకో గలడు.

తండ్రి పోయాక విశ్వం తల్లితోబాటు మామ్మ గారింట్లో సెటిలయ్యాడు. విశ్వం వాళ్ళమ్మకు గవర్న మెంటువాళ్ళిచ్చిన కొద్దిపాటి పెన్షన్‌లోనే యిల్లు గడిచి పోయింది. తల్లిదండ్రులకు విశ్వం వొక్కడే సంతానం. తల్లి విశ్వాన్ని చదివించింది.

విశ్వం వొక మోస్తరు తెలివిగలవాడయినా పరీక్షల్లో మార్కులు బాగానే వచ్చేవి. బియ్యే పాసయ్యాక తండ్రి పనిచేసిన డిపార్టుమెంటులోనే గుమాస్తా వుద్యోగం యిచ్చారు.

''యింక పెళ్ళి చేసుకోరా విస్సూ,'' అంది తల్లి.

క్షణం కూడ ఆలోచించనక్కర్లేకుండా జవాబిచ్చే శాడు విశ్వం— ''నాకు పెళ్ళక్కర్లేదూ'' అని.

''మొదట్లో అందరూ అట్లాగే అంటార్లేవోయ్,'' విశ్వం మామ్మగారు వెటకారమాడింది.

ఆ క్షణంలో వాళ్ళూహించని సమాధానం చెప్పాడు విశ్వం.

''నలభై యేళ్ళకు పోయేవాడికి పెళ్ళెందుకు మామ్మా?''

మామ్మగారు మాటపడిపోయినట్టు చూసింది.

తల్లి యేడవడం మొదలెట్టింది.

''ఆయనంటే అలా పోయాడు. వీడిమీద ఆశలు పెట్టుకుంటే వీడిలా మాట్లడతాడేవిటేఅమ్మా! వాణ్ణలా అనొద్దని చెప్పవే,'' అని పొలోమని యేడ్చేసిందావిడ.

విశ్వం మాట్లాడలేకపోయాడు.

యేడాదికల్లా అతని పెళ్ళి జరిగిపోయింది.

మొదటి రాత్రి ముభావంగా పడుకుండిపోయాడు విశ్వం. రెండో రాత్రి కూడా అలాగే గడిచిపోయింది.

మూడో రాత్రి సుందరే ధైర్యం చేసి పలకరించింది.

''పాలు తాగండి.''

''వద్దు,'' మొదటిసారి భార్య ముందు నోరు విప్పాడు తను.

సుందరి యేడవసాగింది.

''నేనంటే మీకిష్టం లేదు కదూ?''

''అలా అని యెవరన్నారు?''

''మరెందుకు అలా వుంటారు నన్ను చూసి?''

విశ్వానికి జాలి వేసింది.

''చూడు సుందరీ! పాపం మీవాళ్ళు నామీద చాలా అభిమానంతో నిన్ను నాకిచ్చి పెళ్ళి చేశారు. నీకూ నేనంటే యిష్టమేననుకుంటాను. కాని, యేంచేస్తాం? నువ్వప్పటికి చాలా చిన్నదానివిగానే వుంటావు. నేను నలభై యేళ్ళలో పోతాను.''

సుందరి యేడుపు మాని, ''యెక్కడికి?'' అనడి గింది అయోమయంగా.

''అదే తెలీదు. పోయాక తెలుస్తుంది.''

సుందరికింకా యేమీ అర్థం కాలేదు. అమాయకంగా చూసింది.

''నేను నలభై యేళ్ళలో పోతాను.'' మరోసారి మృదువుగా అన్నాడు విశ్వం.

యీసారి అర్థమై సుందరి వొక్క పెట్టున యేడవ సాగింది.

అదివిని విశ్వం అమ్మా, మామ్మా వచ్చారు.

''ఆయనేమేమో మాట్లాడుతున్నారత్తయ్యా'' అత్త గార్ని పట్టుకుని యేడ్చేసింది సుందరి.

విశ్వం యేమన్నాడో కొద్ది ప్రయత్నం మీద కూపీ లాగారు వాళ్ళు. అది వినగానే విశ్వం తల్లి విరుచుకు పడిపోయింది.

మరుసటిరోజు కూతురూ అల్లుళ్ళని తన యింట నిద్ర చేయించడానికి వచ్చిన విశ్వం మామగారికి యీ సంగతి తెలిసింది.

ఆయన సిద్ధాంతిగారిని పిలిపించాడు.

సిద్ధాంతిగారు గ్రహ దోషాలు వగైరా వగైరా లెక్కేసి చూసి విశ్వానికి నలభై యేళ్ళల్లో చావు మందగించడం కంటె పెద్ద గండమేదీ వుండదనీ, ఆ మాటకొస్తే అతను తొంభై యేళ్ళకు పైబడి జీవిస్తాడనీ, కాకపోతే ప్రస్తుతం విశ్వం నెత్తిమీద శనిగ్రహం కూర్చొని అతనిచేత యిలాంటి ప్రేలాపనలు చేయిస్తున్నాడని నిఖార్సుగా తేల్చి చెప్పేశాడు.

గ్రహశాంతి జరిగింది. అందరూ తేలిగ్గా వూపిరి పీల్చుకున్నారు.

విశ్వం మరి మాట్లాడలేక మామూలు సంసార జీవితం ప్రారంభించాడు.

మూణ్ణెల్లు గడిచాక సుందరికి గర్భమని తెలుసు కున్నాడు విశ్వం.

''చూడు సుందరీ నాకీ బిడ్డ పుట్టడం యిష్టం లేదు.''

''యేం?'' నివ్వెరపోయింది సుందరి.

''నేను చిన్న వయసులో పోతే నువ్వా బిడ్డనెలా పెంచుతావు? అబార్షన్ చేయించుకో.''

సుందరి మళ్ళీ ఏడవడం మొదలెట్టింది.

యీసారి విశ్వం తల్లి యేడవలేదు.

''మీ నాన్న పోతే నిన్ను నేనెలా పెంచానో అదీ అలాగే పెంచుతుంది. నువు నోర్మూసుకు పడుండు,'' కొడుకు పైకి వొంటి కాలిమీద లేచిందావిడ.

యింకా కొన్నేళ్ళు గడిచాయి.

విశ్వానికిప్పుడు యిద్దరు మగ పిల్లలు, వొక ఆడపిల్ల. విశ్వం యెప్పుడూ వాళ్ళ గురించే ఆలోచించేవాడు.

## ఫ్లోరైడ్ టూత్ పేస్ట్: నిషేధానికి సుప్రీంకోర్టు తిరస్కృతి

టూత్ పేస్టులో 'ఫ్లోరైడ్' వాడకాన్ని లేదా 'ఫ్లోరైడ్' మిళితం చేసిన టూత్ పేస్టులపై నిషేధం విధించాలని కోరుతూ న్యాయవాది శ్రీ ఎం.ఎం. జొహారీ వ్యక్తిగతంగా దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు తిరస్కరించింది. ఈ పిటిషన్‌పై ప్రతివాదులు ఫోర్‌హాన్స్ ఫ్లోరైడ్ టూత్ పేస్ట్ ఉత్పత్తిదారులైన జాఫరీ మేనర్స్ అండ్ కో లిమిటెడ్, సిబాకా ఫ్లోరైడ్ టూత్ పేస్ట్ ఉత్పత్తిదారులైన హిందుస్తాన్ సిబా- గెయిగీ లిమిటెడ్ సంస్థ అందించిన శాస్త్రీయ సమాచారాన్ని సుప్రీంకోర్టు పరిగణనలోనికి తీసుకుంది.

టూత్ పేస్టులో ఫ్లోరైడ్ వాడకం వల్ల పిల్లల్లో పంటి జబ్బులు, ఎముక రుగ్మతలు వంటివి వస్తాయని జొహారీ తన పిటిషన్‌లో పేర్కొన్నారు.

అయితే, అందుకు సాక్ష్యాధారాలు వైద్య శాస్త్రరీత్యా కాని, విజ్ఞాన శాస్త్ర పరిశీలనం రీత్యాకాని ఏమీ లభించలేదు. పైగా ప్రపంచ ఆరోగ్య సంస్థ కూడా ఫ్లోరైడ్ టూత్ పేస్టుల వాడకాన్ని సిఫార్సు చేసింది.

ఈ అంశాలను పరిగణనలోనికి తీసుకొని సుప్రీంకోర్టు జొహారీ పిటిషన్‌ను తిరస్కరించింది.

జి.పి.ఎఫ్. నుండి పెంచి నాకేసారి రెండు వందల యాభై కడతాననే సరికి విశ్వం స్నేహితులు దంగైపోయారు.

"మరేం లేదు. నేను తొందరగా పోతే మా ఆవిడ యేమైపోతుంది, నా పిల్లలేమై పోతారు? మా అమ్మకు పెన్షన్ వస్తుంది. నాకొచ్చే జీతంలోంచి కొంత డబ్బు తగ్గిపోయినా ప్రస్తుతానికి యింటిఖర్చులకేమీ బెంగ లేదు," అన్నాడు విశ్వం.

విశ్వం స్నేహితులకు అతని వాగుడు గురించి ముందే తెలుసు. అందుకే అతనికి వాగుడు [illegible] పేరు కూడా పెట్టేశారు. విశ్వం లైఫ్ యిన్సూరెన్సు కూడా చాలా పెద్ద మొత్తాలు కట్టాడు.

కాలం ఇట్టే గడిచి పోయింది.

విశ్వం ఇప్పుడు నలభయ్యో పడిలోఅడుగు పెట్టాడు. ఈలోపల అతని మామ్మగారు కాలం చేసింది.

విశ్వం బాధపడలేదు.

"పుట్టిన ప్రతిజీవీ యెప్పుడో వొకప్పుడు చావడానికే పుడతాడు" అన్నాడతను.

నలభయ్యో పడిలో అడుగు పెట్టాక విశ్వంలో చాలా మార్పు వచ్చింది.

ఆఫీసులో పని అరియెర్సు లేకుండా పూర్తిగా చేయడానికి రాత్రింబగళ్ళు కష్టపడి పనిచేయడం మొదలెట్టాడు.

పై ఆఫీసరుకు విశ్వం మీద అభిమానం జాస్తి.

"అంత స్ట్రెయిన్ తీసుకోకోయ్, ఆరోగ్యం చెడేను" అన్నాడు.

"నాకు నలభైయేళ్ళొచ్చాయి సార్. ఎప్పుడు పోతానో, పని బకాయి పెట్టి పోవడం నాకిష్టం లేదు" అన్నాడు విశ్వం.

విశ్వం ఛలోక్తి విసిరాడనుకుని ఆఫీసరు "భలేవాడివోయ్" అని నవ్వేశాడు.

పరిశుభ్రత కూడా మానేశాడు విశ్వం.

గడ్డం గీయడం మానేశాడు. గోళ్ళు తీయడం మానేశాడు. వొంట్లో నలతగా వుంటే మందులు తీసుకోవడం మానేశాడు.

స్నానానికిక్కూడా సుందరే బలవంతంగా లేపేది.

"మనిషి జీవితమెంత? మట్టిలో కలిసి పోవాల్సిన ఈ దేహం మీద మట్టి పేరుకుంటేనేం?" అనేవాడు విశ్వం.

సుందరి పట్టించుకోదు. ఆమెకు భర్త ధోరణి అలవాటైపోయింది.


## జాతీయ భాషా సమైక్యతా గ్రంథములు ◊ సాంకేతిక విజ్ఞాన గ్రంథములు

| | | | |
|---|---|---|---|
| 30 రోజులలో | తమిళ భాష | వెల రూ. | 7.50 |
| ,, ,, | హిందీ భాష | వెల రూ. | 7.00 |
| ,, ,, | కన్నడ భాష | వెల రూ. | 8.00 |
| ,, ,, | మలయాళ భాష | వెల రూ. | 7.50 |
| ,, ,, | సంస్కృత భాష | వెల రూ. | 7.00 |
| ,, ,, | ఆంగ్ల భాష | వెల రూ. | 11.00 |
| ,, ,, | ఉర్దూ భాష | వెల రూ. | 8.50 |
| ,, ,, | మరాఠి భాష | వెల రూ. | 6.50 |
| ,, ,, | బెంగాళి భాష | వెల రూ. | 4.50 |
| ,, ,, | పంజాబి భాష | వెల రూ. | 6.00 |
| ,, ,, | గుజరాతి భాష | వెల రూ. | 5.50 |
| | ఆంగ్ల సంభాషణము | వెల రూ. | 7.30 |
| | బాలాజీస్ ఈసీ వే టు స్పీక్ ఇంగ్లీష్ | వెల రూ. | 19.75 |

పైకనుబరచిన పుస్తకములన్నీ తెలుగుమూలంగా ఇతర భాషలను వ్యాకరణ రీతిగా వ్రాయుటకు, చదువుటకు, మాట్లాడుటకు, వుపకరించు గొప్ప గ్రంథములు. పుస్తకమును కోరువారు పుస్తకపు వెలతో రూ. 3.50 చేర్చి M.O. పంపండి.

| | | |
|---|---|---|
| ట్రాన్సిస్టర్ రేడియో | వెల రూ. | 5.75 |
| ట్రాన్సిస్టర్ రిపేరింగ్ | వెల రూ. | 5.75 |
| హౌస్ వైరింగ్ | వెల రూ. | 8.50 |
| మోటార్ రీవైండింగ్ Part I | వెల రూ. | 11.50 |
| మోటార్ రీవైండింగ్ Part II | వెల రూ. | 12.75 |
| T.V. మెకానిజం | వెల రూ. | 15.00 |
| టేప్ రికార్డర్ | వెల రూ. | 8.75 |
| మోటార్ మెకానిజం | వెల రూ. | 8.75 |
| రెఫ్రిజిరేషన్ & ఏర్‌కండిషన్ | వెల రూ. | 8.75 |
| మోడరన్ ఫోటోగ్రఫీ | వెల రూ. | 18.50 |
| లేత్‌వర్క్స్ | వెల రూ. | 6.75 |
| గ్యాస్ & ఆర్క్ వెల్డింగ్ | వెల రూ. | 7.75 |
| మెటల్ & షీట్‌మెటల్ | వెల రూ. | 6.25 |

పై కనుబరచిన పుస్తకములన్నీ స్వయముగా తయారుచేసుకొనుటకు వాటిలో రాగల చిక్కులను రిపేరు చేసుకొనుటకు ఆయా భాగముల పటములతో అతి సులభముగా అర్థమగునట్లు వివరించబడి యున్నవి.

BP
**BALAJI PUBLICATIONS**
103, PYCROFTS ROAD MADRAS-600 014

విశ్వానికి నలభై యేళ్ళు పూర్తికావచ్చాయి. ఆఫీసుకు సెలవు పెట్టేశాడు.

"నలభై వొకటో పుట్టిన్రోజు నాకు జరగదు సార్. పిల్లలతో గడపాలనుకుంటున్నాను" అన్నాడు ఆఫీసర్తో.

"అతనికి గుండె జబ్బు లాంటిదేమైనా వుందటయ్యా? యెప్పుడూ అలాగే మాట్లాడతాడు" ఆరా తీశాడాయన.

"అతని కేమైంది సార్, దుక్కలా వుంటేను. అతనిగిలే అతని జబ్బు" అన్నారు విశ్వం స్నేహితులు.

"పోన్లే ఆఫీసులో వొళ్ళొంచి పని చేస్తాడు. కొన్ని రోజులు రెస్టు తీసుకోనీ" అన్నాడు ఆఫీసరు.

విశ్వం భార్యా పిల్లల్తో చాలా కులాసాగా గడిపేశాడు.

అతని నలభై వొకటో పుట్టిన్రోజు దగ్గర పడింది.

వొకరోజు తన యెనిమిదేళ్ళ కూతుర్ని దగ్గర కూర్చోబెట్టుకుని అన్నాడు విశ్వం. తన పిల్లల్లో కూతురంటే విశ్వానికి చాలా ప్రేమ.

"నీ కేం కావాలో చెప్పు తల్లీ, తెచ్చిపెడతాను. ఆ తర్వాత నేను వెళ్ళిపోతాను"

"ఎక్కడికి నాన్నా?" అడిగింది కూతురు.

విశ్వం రహస్యం చెబుతున్నవాడిలా ముందుకు వంగి, "వో పెద్ద రహస్యం తెలుసుకోవడానికి" అన్నాడు గుసగుసగా.

ఆ తర్వాత తన పుట్టిన్రోజు రేపనగా విశ్వం విరుచుకు పడిపోయాడు.

"యేమైందండీ?" ఖంగారుగా వచ్చింది సుందరి.

"నొప్పి. గుండెల్లో నొప్పి"

ఆ మాట వినగానే విశ్వం తల్లి పెద్ద పెట్టున కేకేసి మూర్ఛపోయింది.

విశ్వాన్ని వెంటనే కార్డియాక్ స్పెషలిస్టు దగ్గరకు తీసుకుపోయారు.

అతన్ని మిషన్‌పెట్టి సుదీర్ఘంగా పరీక్షించిన మీదట డాక్టర్ అన్నాడు" నీ గుండెలో ఏ లోపం లేదు. బి.పి. కూడా లేదు. గుండెలో నొప్పిగా ఎందుకుంది నీకు?"

"లేదు డాక్టర్ నా గుండె సరిగ్గా పని చెయ్యడం లేదు. కావాలంటే సరిగ్గా పరీక్ష చేసుకోండి.

డాక్టర్ జాలిగా చూశాడు. ఇలా లేని రోగం వుందని వచ్చేవాళ్ళు ఆయన దగ్గరకు సుమారుగా వస్తుంటారు.

"చూడు, నువ్వేం భయపడనక్కర్లేదు. నీకే రోగమూ లేదు"

"లేదు డాక్టర్. రేపటిలోగా నేను చచ్చిపోతాను. నలభై ఏళ్ళకంటే ఎక్కువ నేను బ్రతకను. రేపు నా నలభై వొకటో పుట్టిన్రోజు" అన్నాడు విశ్వం.

"ఐసీ," అని తలపంకించాడు డాక్టరు.

"చూడు బాబూ! నీకు సరైన డాక్టర్ని నేను కాను. నీకు వైద్యం చేయాల్సింది సైకియాట్రిస్టు. అయినా, ఒక మాట చెప్పమంటావా? మనిషి పుట్టింది చావడానిక్కాదయ్యా, బతకడానికి. ఇక్కడి కొచ్చే రోగుల్ని చూడూ, వొక్కొక్కరూ ఎంతో తీవ్రమైన గుండె జబ్బుతో వస్తారు. సాధ్యమైనంత వరకు చావుతోయుద్ధం చేస్తారు. చాలా మంది గెలుస్తారుకూడా. కారణమేమిటో తెలుసా? వాళ్ళల్లో బతకాలన్న కోరికబలంగా వుండడమే. చావాలన్న కోరిక చాలా చెడ్డది. ఇలాంటి పిచ్చి పిచ్చి ఆలోచనలు పెట్టుకోవడం ఆత్మహత్యతో సమానం. ఇలా మధనపడుతూ కూర్చుంటే నీకు గుండెజబ్బు ఈ రోజు కాకపోయినా రేపురావచ్చు. ఆత్మహత్యమహాపాపం తెలుసా? లైఫ్ ఈజ్ ఏ బ్యాటిల్. ఫైటిట్. నౌ, బీ యె బ్రేవ్ మేన్. ధైర్యంగా చాలా యేళ్ళు బతుకుతావ్ చావాలని మాత్రం మనసారా కోరుకోకు. నీ కింకా చాలా భవిష్యత్తుంది." అని చెప్పేసి విశ్వాన్ని ఇంటికిపంపేసి. "పూర్ ఫెలో" అని జాలిపడ్డాడు డాక్టర్.

ఆ రోజు రాత్రి సరిగ్గా నిద్ర పోలేక పోయాడు విశ్వం. సుందరి అతన్ని కనిపెట్టుకొని కూర్చుంది.

"సుందరీ! రేపుదయం వస్తుందంటావా?"

"వస్తుందండీ, తప్పకుండా వస్తుంది" సగం కన్నీళ్ళతో అంది సుందరి.

విశ్వం సుందరి చేతులు పట్టుకున్నాడు.

"నిజంగానే వస్తుందా?"

"మీకు మనసు బాగాలేదు. రాత్రి నిద్ర పట్టకపోతే నిద్రమాత్ర వేసుకోమని డాక్టర్ చెప్పాడు. తెస్తానుండండి" అంది సుందరి.

నిద్రమాత్ర వేసుకుని విశ్వం భార్య చేతుల్లో నిద్రపోయాడు.

తెల్లవారుజామున అయిదింటికి, సుందరి రాత్రంతా భర్త గుండెలమీద తలవాల్చి అతని గుండె చప్పుళ్ళు వింటూ మేల్కొని వుండిపోయినదల్లా లేచి వెళ్ళి కిటికీ రెక్కలు తెరిచి సూర్యోదయం కోసం ఎదురు చూస్తూ కూర్చుంది.

ఆనాటి సూర్యోదయం సుందరి జీవితాంతం మర్చిపోలేనిది.

తొలి కిరణాలు భర్తనుదుటిని సోకడం చూసి, నిద్రపోతున్న అతని నుదుటి మీద సన్నగా ముద్దు పెట్టుకొని నిద్ర లేపకుండానే పెరట్లోకి వెళ్ళిపోయింది.

విశ్వం నిద్రలేచి కాస్సేపు ఆలోచించుకుంటూ వుండిపోయాడు. తర్వాత పక్కమీద నుంచి లేచి గడ్డం గీసుకుని తలంటు స్నానం చేసి చక్కగా డ్రెస్ చేసుకున్నాడు. భర్త ఆ క్షణంలో సుందరికి నవయువకుడిలా కనిపించాడు.

విశ్వం పుట్టిన రోజుని ఆ రోజు సుందరి విందు భోజనం వండిపెట్టింది.

భోజనాలప్పుడు విశ్వం పెద్దకొడుకు కంచం పక్కగా పెద్ద గండు చీమ పోతుంటే ఎడం చేతి చూపుడు వేలు పెట్టి నలపబోయాడు.

విశ్వం చప్పున కొడుకు చెయ్యి పట్టుకున్నాడు.

"వొద్దు. తప్పు"

"అది కరుచుకుంటే వదల్దు నాన్నా!"

"సర్లే అదిప్పుడు నిన్నేం చేసింది?" కోప్పడ్డాడు విశ్వం తర్వాత ఒక్క క్షణం ఆగి –

"ప్రతి జీవీ బ్రతకడానికే పుడుతుంది" అన్నాడు.



## పాట మిగిలింది

(కొసరాజు స్మృతి గీతి)

పాట కోసం నీవు పుట్టావు
పాట కన్నియ వెన్ను తట్టావు
పాట తోటను నిలిచి, పాట నాటకు పిలిచి
పాటతోనే మిన్నుముట్టావు—

ఏరువాకగ నీవు వచ్చావు
నోరుతీయని పాట తెచ్చావు
వాలుగన్నుల చెలియ హంసనడకలు చూచి
వాక్కు నజరానాల నిచ్చావు

నందామయా గురుడ రాశావు
తందాన తానలను వేశావు
చేతిలో డబ్బులకు, జేబులో బొమ్మలకు
చిక్కకుండా కన్ను మూశావు

ఇల్లరికమే మజా అన్నావు
కల్లమాటలు కొట్టివేశావు
పల్లె పదములు పెట్టి, పాట కోటలు కట్టి
ఇల్లు ఖాళీచేసి పోయావు

వేమన్న వగుచు జనియించావు
ఆమనుల నిచట సృజియించావు
జానపదముల దెచ్చి, జ్ఞాన పథికుల కిచ్చి
పాటగానే మిగిలిపోయావు—

గుండెనే మాటగా చేశావు
గుప్పెళ్ళ పుప్పొడులు వేశావు
సొంగు గ్రంథము జేసి, 'గ్రంథసొంగుడ' వగుచు
'కొస'కు మా గుండె 'రాజే'శావు

—నాగభైరవ కోటేశ్వరరావు